సాక్షి విశాఖపట్నం

మంగళవారం : 30 : జనవరి : 2024



అర్జీలు సత్వరం పరిష్కరించాలి

'జగనన్నకు చెబుదాం'లో వచ్చిన అర్జీలను తక్షణం పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ అన్నారు. 8లో



పేటెంట్లు కీలకం

స్టార్టప్ సంస్థలు, విశ్వవిద్యాలయాలకు మేధో హక్కుల పరిరక్షణ ఆవశ్యక అంశమని ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ అన్నారు. 8లో

బీచ్‌రోడ్డులో దేవరకొండ



కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో హీరో ఆనంద్ దేవరకొండ నటిస్తున్న సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను రుషికొండ, భీమిలి కొబ్బరిచెట్ల పార్కువద్ద చిత్రీకరించారు. 8లో

న్యూస్‌రీల్

విశాఖ చేరుకున్న రాహుల్ ద్రవిడ్



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న రాహుల్ ద్రవిడ్

గోపాలపట్నం: భారత్ క్రికెట్ జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్ సోమవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్నారు. ఫిబ్రవరి 2 నుంచి 6 వరకు ఇండియా–ఇంగ్లండ్ మధ్య రెండో టెస్టు మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో ఆయన ముందుగా విశాఖ చేరుకున్నారు. ఆయనకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు స్వాగతం పలికారు.

మార్గశిర మాసోత్సవాల ఆదాయం రూ.4.86 కోట్లు



దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాల ఆదాయం రూ.4 కోట్ల 86 లక్షల 46 వేల 924 లభించింది. గతేడాది డిసెంబర్ 13 నుంచి ఈ నెల 11వరకు మార్గశిర ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. నెల రోజుల పాటు సాగిన ఉత్సవాల్లో అమ్మవారి దర్శనం టికెట్లు, ప్రసాదాల విక్రయం, కేశఖండన, వివిధ సేవలు, పూజలు, విరాళాలు, హుండీల ద్వారా రూ.4,86,46,924 వచ్చింది. గతేడాది మార్గశిర మాసోత్సవాల్లో 4,54,36,024 ఆదాయం వచ్చింది. ఈ ఏడాది అదనంగా రూ.32 లక్షల 10 వేల 900 లభించింది. ఉత్సవాలకు సహకరించిన పోలీస్, జీవీఎంసీ, ఏపీఈపీడీసీఎల్, పబ్లిక్ హెల్త్, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, ఫైర్, ఇతర శాఖలకు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష కృతజ్ఞతలు తెలిపారు.

నగరానికి 8 మంది సీఐలు



విశాఖ సిటీ : విశాఖ రేంజ్ నుంచి నగరానికి ఎనిమిది మంది ఇన్‌స్పెక్టర్లను కేటాయించారు. వీరిలో ఇద్దరిని సీఐడీ నుంచి వెనక్కు రప్పించగా.. మిగిలిన ఆరుగురు ఇటీవల ఎస్‌ఐ నుంచి సీఐగా పదోన్నతి పొందిన వారు ఉన్నారు. ఈ మేరకు డీఐజీ హరికృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఐడీ నుంచి ఎ.పార్థసారథి, జి.గోవిందరాజు అలాగే పదోన్నతి పొందిన కల్లూరి శ్రీనివాసరావు, వి.రమేష్, జి.శ్రీనివాసరావు, ఎ.ప్రసాదరావు, జి.అర్జున, ఎల్.రామకృష్ణలను నగరానికి కేటాయించారు.

నేడు మాంసం దుకాణాలకు సెలవు

దాబాగార్డెన్స్ : మహాత్మాగాంధీ వర్ధంతి పురస్కరించుకొని జీవీఎంసీ పరిధిలో మంగళవారం మాంసం, చేపలు విక్రయించరాదని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే రూ.500 నుంచి రూ.5వేల వరకు అపరాధ రుసుముతో పాటు వ్యాపార లైసెన్సులు, పట్టుబడిన మాంసంను సీజ్ చేయనున్నట్టు తెలిపారు.

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్లు జైలు

విశాఖ లీగల్ : బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్లు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు దిమిలి సతీష్ (27) పాత గాజువాక దగ్గర అశోక్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. బాధిత బాలిక అదే ఇంటి కింద భాగంలో నివాసం ఉంటున్నారు. బాలిక శ్రీహరిపురంలోని ఒక పాఠశాలలో చదువుకుంటుంది. 2020 నవంబరు 20వ తేదీన ఉదయం 8.30 గంటల సమయంలో పాఠశాలకు వెళ్లింది. మధ్యాహ్నం సెలవు కావడంతో బాలిక ఇంటికి వెళ్లిపోయింది. ఇదే అదునుగా సతీష్ బాలికను మభ్యపెట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ దృశ్యాలను మరో బాలుడు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి బాలిక పెద్దమ్మకు చూపించాడు. విషయం తెలుసుకున్న బాధితురాలు తల్లి గాజువాక పోలీసులకు అదే రోజు సాయంత్రం ఫిర్యాదు చేసింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితునికి 20 ఏళ్లు జైలు శిక్షతోపాటు రూ.5 వేలు జరిమానా విధించారు. బాధితురాలికి రూ.4 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

టాయిలెట్స్ 2.0

- మహా నగరంలో అత్యాధునిక టాయిలెట్స్
- జోన్‌కు 3 చొప్పున 24 ఏర్పాటుకు జీవీఎంసీ ప్రణాళిక
- అందుబాటులో శానిటరీ ప్యాడ్స్, బేబీ ఫీడింగ్ రూమ్‌లు



అధునాతన వాష్‌బేసిన్స్



బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన టాయిలెట్



బేబీ ఫీడింగ్ రూమ్



టాయిలెట్స్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

నగర ప్రజలకు అడుగడుగునా కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ) కీలక అడుగులు వేస్తోంది. దేశవ్యాప్తంగా కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో భాగంగా మరుగుదొడ్ల నిర్వహణపై చేపట్టిన టాయిలెట్ 2.0లో దూకుడుగా వ్యవహరిస్తోంది. అత్యాధునిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తోంది. జోన్‌కు 3 చొప్పున గ్రేటర్ పరిధిలోని 8 జోన్లలో 24 టాయిలెట్స్ నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ప్రతి మరుగుదొడ్డిలోనూ శానిటరీ ప్యాడ్స్, బేబీ ఫీడింగ్ రూమ్ కూడా ఏర్పాటు చేస్తుండటం విశేషం.

జీవీఎంసీ ప్రత్యేక శ్రద్ధతో..

భారత్‌లోని పట్టణాలు, నగరాల్లో సంపూర్ణ పారిశుధ్యమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలు ఏటా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మరుగుదొడ్ల నిర్వహణపైనా ప్రత్యేక శ్రద్ధ వహించింది. ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న సామాజిక, ప్రజా మరుగుదొడ్లు పూర్తి స్థాయి సౌకర్యాలతో ఉండేలా చూడాలంటూ టాయిలెట్ 2.0 ఛాలెంజ్‌ని నిర్వహిస్తోంది. ఈ ఛాలెంజ్‌ని స్వీకరించిన జీవీఎంసీ.. విశాఖ నగరంలో ప్రజా, సామాజిక మరుగుదొడ్లు, మూత్రశాలల ఏర్పాటు, నిర్వహణను మరింత మెరుగు పరచడంలో శ్రద్ధ వహించింది. అత్యాధునిక టాయిలెట్స్‌ని అందుబాటులోకి తీసుకొస్తోంది.

సౌకర్యాల మరుగుదొడ్లు : టాయిలెట్స్, పారిశుధ్యాన్ని నగరానికి గౌరవంగా.. బాధ్యతగా నిర్వహించేలా జీవీఎంసీ అత్యాధునిక మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టింది. పూర్తిగా అత్యాధునిక పద్ధతిలో మోడ్రన్‌గా టాయిలెట్స్ నిర్మిస్తోంది. ఇండియన్, వెస్టర్న్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తోంది. అన్ని వర్గాల వారికీ అనుకూలంగా ఉండేలా టాయిలెట్స్ నిర్మిస్తోంది. ప్రతి ఒక్కరూ సులభంగా నడిచేలా మెట్లు, ర్యాంప్, హ్యాండ్ సపోర్ట్‌తోపాటు 24 గంటలూ నీటి సౌకర్యం కల్పిస్తోంది. ఫంక్షనల్ ఫ్లష్ సిస్టమ్, అద్దం, వాష్‌బేసిన్, హ్యాండ్ డ్రయర్ తదితర పూర్తి స్థాయి సౌకర్యాలతో టాయిలెట్స్ 2.0 ఏర్పాటవుతున్నాయి.

మహిళలకు ప్రత్యేకంగా..

ఇక మహిళలకు అవసరమైన సౌకర్యాలు కూడా ఈ అధునాతన టాయిలెట్స్‌లో పొందుపరుస్తున్నారు. మహిళల కోసం ఏర్పాటవుతున్న పింక్ టాయిలెట్స్‌లో కాయిన్ వేస్తే వచ్చేలా శానిటరీ న్యాప్‌కిన్స్ మెషీన్లు ప్రతి టాయిలెట్‌లో అందుబాటులో ఉంటాయి. అదేవిధంగా... న్యాప్‌కిన్స్‌ని ధ్వంసం చేసే మెషీన్ కూడా ఉంటుంది. బేబీ ఫీడింగ్ రూమ్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి టాయిలెట్ బ్లాక్‌లో వెంటిలేటర్/ఎగ్జాస్ట్ ఫ్యాన్ అమర్చారు. థర్డ్ జెండర్ కోసం ప్రత్యేకంగా టాయిలెట్‌ని ఇందులో ఏర్పాటు చేయడం విశేషం.

పూర్తిస్థాయిలో ఆధునికీకరణ



టాయిలెట్ 2.0లో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా జోన్–1లో ఒకటి, జోన్–2, 4, 5లో 2, జోన్–3, 6,7 లో 3 చొప్పున, జోన్–8లో 4 టాయిలెట్స్ ఆధునికీకరిస్తున్నాం. టూరిస్ట్‌స్పాట్స్, రద్దీగా ఉండే మార్కెట్ ప్రాంతాలు, బస్టాప్‌లు, హాస్పిటల్స్ తదితర ప్రాంతాల్లో టాయిలెట్స్ 2.0 సిద్ధం చేస్తున్నాం. ఇవి పూర్తయ్యాక మిగిలిన వాటిపైనా దృష్టి సారిస్తాం.

– సాయికాంత్ వర్మ, జీవీఎంసీ కమిషనర్

సకల సౌకర్యాలు



నగర ప్రజలతో పాటు పర్యాటకులకు అసౌకర్యం కలగకుండా అత్యాధునిక మరుగుదొడ్లను అభివృద్ధి చేస్తున్నాం. ప్రత్యేకంగా మహిళల అవసరాలను తీర్చే విధంగా వీటిని రూపుదిద్దుతున్నాం. పర్యాటక ప్రాంతాలతో పాటు నగరంలో రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నాం.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

డీఐజీగా విశాల్ గున్నీ

- నగర జాయింట్ కమిషనర్‌గా ఫకీరప్ప
- డీసీపీ–1గా మణికంఠ, డీసీపీ–2గా సత్యనారాయణ



ఫకీరప్ప



విశాల్ గున్నీ



మణికంఠ



సత్యనారాయణ

విశాఖ సిటీ : విశాఖ రేంజ్ డీఐజీగా విజయవాడలో లా అండ్ ఆర్డర్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న విశాల్ గున్నీ నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న డీఐజీ హరికృష్ణ డీజీపీ కార్యాలయంలో ఐజీ (పర్సనల్)గా బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చాలా కాలంగా ఖాళీగా ఉన్న నగర జాయింట్ కమిషనర్ పోస్టులో విజయవాడలో సీఐడీ ఎస్పీగా పనిచేస్తున్న ఫకీరప్పను నియమించింది. నగర అవసరాలకు అనుగుణంగా జాయింట్ కమిషనర్ పోస్టు కావాల్సి ఉండగా తాజా ఆ పోస్టును ప్రభుత్వం భర్తీ చేసింది. అలాగే డీసీపీ–1 శ్రీనివాసరావును జగ్గయ్యపేట డీసీపీగా, డీసీపీ–2 ఆనంద్‌రెడ్డిని విజయవాడ డీసీపీ(లా అండ్ ఆర్డర్)గా బదిలీ చేశారు. వారి స్థానంలో శ్రీకాకుళం అడిషనల్ ఎస్పీ(సెబ్)గా పనిచేస్తున్న మణికంఠ చందోల్‌ను డీసీపీ–1గా, విజయవాడలో డీసీపీగా పనిచేస్తున్న మోకా సత్యనారాయణను డీసీపీ–2గా నియమించారు.

విశాఖ-కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-కిరండూల్ రైలుకు ఫిబ్రవరి, మార్చి నెలల్లో మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. విశాఖలో బయల్దేరే విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ రైలుకు ఫిబ్రవరి 2, 3, 4, 9, 10, 11, 16, 17, 18, 23, 24, 25 మార్చి 1, 2, 3, 8, 9, 10, 15, 16, 17, 22, 23, 24, 29, 30, 31వ తేదీల్లోను, కిరండూల్‌లో బయల్దేరే కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రైలుకు ఫిబ్రవరి 3, 4, 5, 10, 11, 12, 17, 18, 19, 24, 25, 26, మార్చి 2, 3, 4, 9, 10, 11, 16, 17, 18, 23, 24, 25, 30, 31 ఏప్రిల్ 1వ తేదీల్లో మరో విస్టాడోమ్ కోచ్‌ను జతచేస్తున్నట్లు పేర్కొన్నారు. మరింత మంది ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని అరకు అందాలను అద్దాల కోచ్‌ల నుంచి వీక్షించవచ్చన్నారు.

14న జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి 14వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో ఎం.పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు విశాఖ జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి సభ్యులు, ఆహ్వానితులు హాజరుకావాలని పేర్కొన్నారు. సమావేశానికి ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి అన్ని శాఖల జిల్లా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

పాత టారిఫ్‌లే..

- వరుసగా రెండో ఏడాది విద్యుత్ చార్జీల పెంపు లేనట్లే..
- ఏపీఈఆర్‌సీకి ప్రతిపాదనలు వెల్లడించిన ఈపీడీసీఎల్
- 2024–25 ఆర్థిక సంవత్సరంలోనూ పాత టారిఫ్‌లే అమలు
- విద్యుత్ అమ్మకాలూ గణనీయంగా వృద్ధి
- రెవెన్యూ డిమాండ్‌కు అనుగుణంగా ఆదాయం
- ఐదేళ్ల కాలంలో 116 33/11కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణం



ప్రతిపాదనలు వెల్లడిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం : ప్రతిపక్షాల విమర్శల నోటికి తాళం పడింది. విద్యుత్ చార్జీలు పెంచేస్తున్నారంటూ గగ్గోలు పెట్టి ప్రజల్లో ఆందోళనలు సృష్టించిన పచ్చ మీడియా రాతలకు అర్థం లేకుండా పోయింది. గతేడాది టారిఫ్‌లే 2024–25 ఆర్థిక సంవత్సరంలోనూ అమల్లో ఉంటాయనీ.. వినియోగదారులపై ఎలాంటి చార్జీల భారం మోపడం లేదని ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) స్పష్టం చేసింది. నగరంలో నిర్వహించిన ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణలో సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి వివరాలు వెల్లడించారు. విద్యుత్ అమ్మకాలు గణనీయంగా వృద్ధి చెందడం, రెవెన్యూ డిమాండ్‌కు అనుగుణంగా ఆదాయం సమకూరడంతో వినియోగదారులపై భారం మోపకూడదని నిర్ణయించుకున్నట్లు తమ ప్రతిపాదనల్లో స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఈపీడీసీఎల్ పరిధిలో నెట్‌వర్క్ అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఏటా ఏప్రిల్ 1 నుంచి కొత్త చార్జీలు అమల్లోకి రావడం ఆనవాయితీ. పేదలు మినహా అన్ని వర్గాల వినియోగదారులపై ఎంతో కొంత పెంపు సాధారణంగా ఉంటుంది. అయితే.. 2023–24లో అనూహ్యంగా ఇంటెన్సివ్ పరిశ్రమలు(ఫెర్రో అల్లాయిస్) మినహా.. ఏ ఒక్క కేటగిరీలోనూ చార్జీలు పెంచాలని డిస్కమ్ ప్రతిపాదించలేదు. ఈసారి కూడా అదే పంథా కొనసాగిస్తూ 2024–25 ఆర్థిక సంవత్సరంలోనూ ఎలాంటి భారం మోపే ఆలోచన లేదంటూ ఏపీఈపీడీసీఎల్ స్పష్టం చేసింది. దీంతో విద్యుత్ వినియోగదారులపై వరుసగా రెండో ఏడాది చార్జీల భారం ఉండదని స్పష్టమైంది. ఈసారి కూడా ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు, గ్రీన్ పవర్, రైల్వేలకు సరఫరా చేసే విద్యుత్‌పై మాత్రమే స్వల్ప భారం మోపనున్నట్లు సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఏపీఈఆర్‌సీకి అందించిన ప్రతిపాదనల్లో స్పష్టం చేశారు. గృహ, పారిశ్రామిక, వాణిజ్య, వ్యవసాయం ఏ ఇతర కేటగిరీల్లోనూ పైసా భారం కూడా మోపకపోవడం విశేషం. 2023–24లోనూ ఏ ఒక్క కేటగిరీపైనా భారం మోపలేదు.

'బాబు' బకాయిల పాపాల్ని మోస్తూ...

చంద్రబాబు హయాంలో బకాయిలు చెల్లించకపోవడంతో ఈపీడీసీఎల్‌తో పాటు ఇతర డిస్కంలు నష్టాల్లో కూరుకుపోయాయి. వాటి నుంచి గట్టెక్కించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదటి రెండేళ్లు స్వల్పంగా చార్జీలు పెంచాల్సిన పరిస్థితి దాపురించింది. గత టీడీపీ హయాంలో 2014–15 నుంచి 2018–19 వరకూ ప్రభుత్వ సబ్సిడీ కింద రూ.11 వేల కోట్ల వరకూ చెల్లించాల్సి ఉండగా చంద్రబాబు ప్రభుత్వం కేవలం రూ.1,711.22 కోట్లు మాత్రమే చెల్లించి చేతులు దులిపేసుకుంది. వైఎస్ జగన్ ప్రభుత్వం మాత్రం నాలుగేళ్ల కాలంలో ఇప్పటివరకు రూ.9,341.60 కోట్లు చెల్లింపులు చేసింది. అదే విధంగా విద్యుత్ అమ్మకాల్లోనూ క్రమంగా పుంజుకుంది. 2014–15 నాటికి 13,518 మిలియన్ యూనిట్లు విద్యుత్ విక్రయాలు జరగ్గా.. 2023–24 నాటికి రెండు రెట్లకు పైగా పెరిగి ఏకంగా 27,864 మి.యూనిట్లకు చేరుకుంది. పంపిణీ నష్టాల్ని కూడా క్రమంగా తగ్గించుకుంది. 2014–15 నాటికి 8.45 శాతంగా ఉన్న పంపిణీ నష్టం ప్రస్తుతం 5.98 శాతానికి తగ్గింది. వాణిజ్య పరమైన నష్టాల్లోనూ ఈపీడీసీఎల్ కోలుకుంది. చంద్రబాబు గద్దె దిగే నాటికి 18.31 శాతం ఉండగా.. ప్రస్తుతం కేవలం 9.16 శాతానికి మాత్రమే పరిమితమైంది.

నెట్‌వర్క్ అభివృద్ధికి ప్రణాళికలు

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈపీడీసీఎల్ పరిధిలో నాలుగేళ్ల కాలంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ఏకంగా 116 సబ్‌స్టేషన్లను 33/11 కేవీ సామర్థ్యంతో నిర్మించారు. భవిష్యత్తులో నెట్‌వర్క్ అభివృద్ధికి సుదీర్ఘ ప్రణాళికలు రూపొందించామని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో ఈపీడీసీఎల్ డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, ఏ.వి.వి.సూర్యప్రతాప్, సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రసన్నకుమార్, సీజీఎంలు ఎం.రామకృష్ణ, వి.విజయలలిత, డి.సుమన్ కళ్యాణి, ఒ.సింహాద్రి, అచ్చి రవికుమార్, బి.రామచంద్రప్రసాద్, జె.శ్రీనివాసరావు, ఎం.రవీంద్ర, ఎస్.హరిబాబు, ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఊరూవాడా 'ఆరోగ్యరక్ష'

- జిల్లా వ్యాప్తంగా రికార్డు స్థాయిలో వైద్య శిబిరాలు
- రోగుల నుంచి అనూహ్య స్పందన
- ఒక్కో శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టులతో పాటు ఐదుగురు వైద్యులు



కొబ్బరితోటలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : ప్రజల సంపూర్ణ ఆరోగ్య రక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు మంచి స్పందన లభిస్తోంది. జిల్లాలో ఇటు గ్రామీణ, అటు పట్టణ ప్రాంతాల్లో వైద్యులు సేవలందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న శిబిరాలకు రోగులు రద్దీ పెరిగింది. దీంతో రికార్డు స్థాయిలో ఓపీలో పేర్లు నమోదవుతున్నాయి.

జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా ఈనెల 2వ తేదీ నుంచి జూన్ 30 వైద్య శిబిరాలు నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసిన సంగతి విదితమే. ఈ సందర్భంగా మొత్తం 605 వైద్య శిబిరాలు నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించారు. అర్బన్‌లో 551 వైద్య శిబిరాలు, గ్రామీణ ప్రాంతాల్లో 54 వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అర్బన్‌లో ప్రతి బుధ, గురువారం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

101 శిబిరాల ద్వారా 46,021 మందికి సేవలు

రూరల్,అర్బన్‌లో ప్రాంతాల్లో మొత్తం 605 వైద్య శిబిరాలకుగాను 101 శిబిరాలు ఇప్పటికే నిర్వహించారు. ఇంకా 504 శిబిరాలు నిర్వహించాల్సి ఉంది. ఇంతవరకు 46,021 మందికి ఓపీ సేవలు అందించారు. 146 కేసులను వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. అర్బన్‌లో 87 శిబిరాల ద్వారా 37,192 మందికి వైద్య సేవలందించగా.., 121 కేసులు ఆరోగ్యశ్రీ కోసం వివిధ కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. రూరల్‌లో 14 వైద్య శిబిరాల ద్వారా 8,829 మందికి సేవలు అందించారు. మొత్తం 25 మందిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పలు నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు.

వైద్యుల పర్యవేక్షణలో..

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు జనరల్ ఫిజిషియన్, డెంటల్, గైనిక్, పిల్లల వైద్యులు, కంటి వైద్యుడు హాజరవుతున్నారు. వీరితో పాటు నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది కూడా సేవలందిస్తున్నారు.

తొమ్మిది రకాలు పరీక్షలు

- 9 రకాల పరీక్షలు నిర్వహించడానికి ప్రతి శిబిరాల్లో ఏర్పాట్లు చేశారు.
- రోగులకు అవసరమైన 175 రకాల మందులను కూడా సిద్ధం చేశారు. మందుకు కూడా ఉచితంగా అందజేస్తున్నారు.
- ప్రజలకు ఏడు రకాల పరీక్షలు, ఈసీజీ నిర్వహణ కోసం ఏర్పాట్లు చేశారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, ఉమ్ము, డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా పరీక్షలు చేస్తున్నారు.



రంగిరీజు వీధి పరిధి జబ్బరితోటలో జరిగిన వైద్య శిబిరంలో ఓపీ కోసం పేర్లు నమోదు చేస్తూ..

రెండో విడత వైద్యశిబిరాలు

ఈ నెల 2 నుంచి జూన్ 30 వరకు

మొత్తం నిర్వహించే శిబిరాలు : **605**

అర్బన్‌లో : **551**

గ్రామీణ ప్రాంతాల్లో : **54**

ఇప్పటి వరకు నిర్వహించిన శిబిరాలు : **101**

వైద్య సేవలు పొందినవారు : **46,021**

ఆరోగ్యశ్రీలో సేవలకు రిఫర్ చేసిన కేసులు : **146**

అర్బన్‌లో : ప్రతి బుధ,గురువారాల్లో

గ్రామీణ ప్రాంతాల్లో : ప్రతి మంగళ, శుక్రవారాల్లో..

విశేష స్పందన



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు జిల్లా వ్యాప్తంగా మంచి స్పందన లభిస్తోంది. సెలవు రోజుల్లో మినహా ఇతర రోజుల్లో వైద్య శిబిరాలు నిర్వహించి సేవలు అందిస్తున్నాం. రోగులకు ఉచితంగా వైద్య సేవలతోపాటు, వివిధ రకాల పరీక్షలు, మందులు కూడా అందజేస్తున్నాం. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి వివిధ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నాం.

– డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, విశాఖ

నిర్వహణ బాగుంది



ఒంట్లో నలతగా ఉంటే మా ఇంటి సమీపంలో వైద్య శిబిరం జరుగుతోంది. అక్కడ పరీక్షల కోసం వెళ్లాను. వైద్యులు బాగా చూశారు. వివిధ రకలైన పరీక్షలు చేశారు. మందులు కూడా ఉచితంగా ఇచ్చారు. గతంలో ఎప్పుడు ఇలాంటి శిబిరాల చూడలేదు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నా..

– సుధా అనిత, వేంకటేశ్వర మెట్ట

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వ శ్రద్ధ తీసుకోవడం చాలా ఆనందంగా ఉంది. గతంలో ఎంతో మంది పాలకులను చూశాం. ఆస్పత్రికి వెళ్లినా పేద ప్రజలకు వైద్య సేవలు అందే పరిస్థితి అంతంత మాత్రంగా ఉండేది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేద ప్రజల ఆరోగ్యం కోసం వారి నివశించే ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహించడం చాలా బాగుంది. అన్ని రకాల పరీక్షలు, మందులు ఇస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

– కందుకూరి పద్మావతి, వెంకటేశ్వర మెట్ట

నిర్ణీత కాలంలో అర్జీలు పరిష్కరించాలి

మహారాణిపేట: జిల్లా వ్యాప్తంగా నిర్వంచిన జగనన్నకు చెబుదాం (జేకేసీ) కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై అధికారులు నిర్దేశిత సమయంలో పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్‌తో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 266 మంది నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ అర్జీదారులకు సత్వరం న్యాయం జరిగేలా చూడాలన్నారు. పెండింగ్ అర్జీలు లేకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. 266 అర్జీల్లో రెవెన్యూ శాఖకు 76, జీవీఎంసీకి 60, పోలీస్ శాఖకు 22, ఇతర శాఖలకు 108 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో ఏసీపీ బాపూజీ, జీవీఎంసీ ఏడీసీ వర్మ, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు..

విశాఖ సిటీ: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 50 ఫిర్యాదులు అందాయి. ఏడీసీపీ ఫిర్యాదులతో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వాటిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.



వినతులు ఇచ్చేందుకు వచ్చిన జనం

జగనన్నకు చెబుదాంకు 93 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (గ్రీవెన్స్)కు 93 వినతులు వచ్చాయి. కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు అర్జీలు స్వీకరించారు. వీటిలో జోన్-1కు ఒకటి, జోన్-2కు ఐదు, జోన్-3కి 14, జోన్-4కు 11, జోన్-5కు 16, జోన్-6కు 22, జోన్-8 కి 11 ఫిర్యాదులు రాగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 13 అందాయి. వీటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీరు రవి కృష్ణరాజు, అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ప్రధాన సిటీప్లానర్ సురేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, కార్యదర్శి పి.నల్లనయ్య, ఎఫ్ఎ అండ్ ఏఓ మల్లికాంబ, డీసీ(ఆర్)ఎమ్‌వీడీ ఫణిరామ్, పలువురు పర్యవేక్షక ఇంజినీర్లు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ శ్రీనివాసరావు

ఘనంగా ఆంధ్రాబ్యాంకు శతాబ్ది ఉత్సవాలు

సీతంపేట: ఆంధ్రాబ్యాంకు విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆంధ్రాబ్యాంకు శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా బ్యాంకు వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. పట్టాభి ముఖచిత్రం, బ్యాంకు లోగోతో ముద్రించిన వెండి నాణాలు, జ్ఞాపికలను విశ్రాంత ఉద్యోగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జి.వాసుదేవమూర్తి, టి.కామేశ్వరరావు, టి.సింహాచలం, టి.కృష్ణారావు, బి.బాపూజి, ఆర్.వి.రవికుమార్, కె.కోటేశ్వరరావు, జి.మృత్యుంజయరావు, బి.హరగోపాల్ పాల్గొన్నారు.



వెండి నాణాలు విడుదల చేస్తున్న అధికారులు

నెలలు నిండని శిశువుకు ఓపెన్ హార్ట్ సర్జరీ

కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యుల ఘనత

అక్కిరెడ్డిపాలెం: విశాఖ నగర చరిత్రలోనే తొలిసారిగా కేవలం 1.3 కిలోల బరువున్న ఓ చిన్నారికి అత్యంత సంక్లిష్టమైన గుండె శస్త్ర చికిత్స (ఓపెన్ హార్ట్ సర్జరీ)ని విజయవంతం చేశారు. సోమవారం షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ పి.సతీష్ తెలిపిన వివరాలు... నగరంలోని ఒక ప్రైవేట్ సంస్థలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న అక్కయ్యపాలెంకు చెందిన గణేష్ కుమార్, రేవతిలకు ఈ నెల 2వ తేదీన కవల పిల్లలు పుట్టారు. బాబు ఆరోగ్యంగానే ఉన్నా పాపకు ఊపిరి అందక ఇబ్బంది పడింది. పాపను లోటస్ పిల్లల ఆస్పత్రిలో చీఫ్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ గణేష్ నేతృత్వంలో నియోనాటాలజిస్ట్ యూనిట్లో చేర్చి సంరక్షించారు. అప్పటికి పాప బరువు 1.2 కిలోలు. అనంతరం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి చెందిన కడల్స్ విభాగంలోని పిడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శాంతి ప్రియ శిశువును పరీక్షించారు. శిశువుకు పుట్టుకతోనే గుండె సమస్య ఉందని నిర్ధారించారు. ఈ సమయంలో ఊపిరితిత్తుల నుంచి శుద్ధి చేసిన రక్తాన్ని గుండెకు తీసుకువెళ్లాల్సిన రక్తనాళాలు అసాధారణంగా గుండె దిగువన కాలేయంలోకి వెళ్లిపోతున్నాయన్నారు. పాపకు కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి కడల్స్ యూనిట్‌లో డాక్టర్ అనిల్ కుమార్ ధర్మపురం నేతృత్వంలో నిపుణుల బృందం 8 గంటల పాటు శ్రమించి ఓపెన్ హార్ట్ సర్జరీ నిర్వహించింది. కాలేయానికి వెళ్తున్న రక్తనాళాలన్నీ జాగ్రత్తగా తీసి వాటిని తిరిగి సాధారణ పద్ధతిలో గుండెలోని ఎడమవైపునకు మార్చారు. పిడియాట్రిక్ కార్డియాక్ ఎనస్తీషియాలజిస్ట్ డాక్టర్ ఆర్.నాగరాజన్ సహకారం తీసుకున్నారు. శస్త్ర చికిత్స అనంతరం నియోనాటల్ ఐసీయూలో డాక్టర్ నిఖిల్ తెన్నేటి నేతృత్వంలో నియోనాటల్ బృందం పాపను కంటికి రెప్పలా కాపాడిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తక్కువ బరువుతో నెలలు నిండకు ముందే పుట్టిన పిల్లలకు సంక్లిష్టమైన గుండె శస్త్ర చికిత్సలు చేసేటప్పుడు మరణాల రేటు చాలా ఎక్కువగా ఉంటుందని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లోనే ఇలా శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడిన అతితక్కువ కేసుల్లో ఇదొకటన్నారు. ఆపరేషన్‌కు సుమారు రూ.20 లక్షల వరకు ఖర్చు అవుతుందని, కానీ పాప తల్లిదండ్రుల కుటుంబ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని 50 శాతం ఖర్చులు కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి భరించిందని, మిగిలిన 50 శాతం పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయానికి హామీ ఇచ్చినట్లు వైద్యులు తెలిపారు. ఇలాంటి శస్త్ర చికిత్సలకు ముంబాయి, ఢిల్లీ, హైదరాబాద్ వంటి నగరాలను ఆశ్రయిస్తుంటాం.. మొదటిసారి తెలుగు రాష్ట్రాల్లోనే విశాఖలోని కిమ్స్ ఐకాన్‌లో విజయవంతంగా నిర్వహించడం గొప్ప విషయమని వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం పాప పూర్తిగా కోలుకుంది. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు సాయి బలరామ కృష్ణ, గోపాల రాజు, రమేష్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.



శిశువు తల్లిదండ్రులు, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యుల బృందం

నేటి నుంచి జీవీఎంసీ ఉద్యోగులకు క్యాన్సర్ పరీక్షలు

డాబాగార్డెన్స్: వచ్చే నెల 4వ తేదీన అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు డాక్టర్ హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో జీవీఎంసీ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించనున్నట్టు అదనపు కమిషనర్ డాక్టర్ వై శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ఏఎంఓహెచ్‌లు పలువురు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ క్లోజ్ ది కేర్ గ్యాప్ థీమ్ ప్రచార కార్యక్రమంలో భాగంగా హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఫిబ్రవరి 4వరకు జీవీఎంసీ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కైలాసపురం జూబ్లీ పోర్టు ఆస్పత్రి ఆవరణలో ప్రతి రోజూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ స్క్రీనింగ్ టెస్టులు ఉంటాయన్నారు. మంగళవారం జోన్ 5, 8 పరిధిలోని జోనల్ సిబ్బందికి, బుధవారం జోన్-6 కార్యాలయ సిబ్బందికి, ఫిబ్రవరి 1న జోన్-3 సిబ్బందికి, 2న జోన్-4, 3వ తేదీన జోన్-1, 2 జోనల్ కార్యాలయ సిబ్బందికి, చివరి రోజు ఫిబ్రవరి 4న జోన్-7, ప్రధాన కార్యాలయ సిబ్బందికి ఈ పరీక్షలు నిర్వహించనున్నారన్నారు. ఈ పరీక్షలను జీవీఎంసీ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెక్షన్ సూపరింటెండెంట్ వి.లలితను 99482 95699 నంబరులో సంప్రదించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ శ్రీనివాసరావు

పేటెంట్లు సాధించడం కీలకం

ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: స్టార్టప్ సంస్థలు, విశ్వవిద్యాలయాలకు మేధోహక్కుల పరిరక్షణ అత్యంత ఆవశ్యక అంశమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. సోమవారం ఏయూ డీపీఐఐటీ-ఐపీఆర్ చైర్, ఆ హబ్, ఆంధ్ర యూనివర్సిటీ, పర్డు యూనివర్సిటీ (యుఎస్ఏ) సంయుక్తంగా ఐపీ అండ్ స్టార్టప్స్ అంశంపై నిర్వహించిన ఒకరోజు అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ స్టీఫెన్ మాట్లాడుతూ స్టార్టప్ రంగంలో జరిగే ఒక నూతన ఆవిష్కరణ ప్రపంచ గతిని మార్చే శక్తిని కలిగి ఉంటుందన్నారు. వీటికి పేటెంట్లు సాధించడం ఎంతో అవసరమన్నారు. తద్వారా యువత నూతన ఆవిష్కరణలకు తగిన గుర్తింపు, గౌరవం, విలువ లభిస్తాయన్నారు. పర్డు యూనివర్సిటీ ఎంటర్‌ప్రూనర్‌షిప్ ప్రోగ్రాం కన్సల్టెంట్ జూలియాన కెసావన్ పర్డు యూనివర్సిటీలో మేధో హక్కుల పరిరక్షణకు అవలంభిస్తున్న విధానాలను వివరించారు. నూతన ఆవిష్కరణలకు పేటెంట్లు సాధించడం, వాటిని వ్యాపారాత్మకంగా మార్పు చేయడం వలన వర్సిటీకి ఆదాయం సమకూరుతున్న విధానాలను వివరించారు. ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం మాట్లాడుతూ దేశీయంగా విశ్వవిద్యాలయాల్లో ఐపీఆర్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని పలు ఉదాహరణలతో వివరించారు. స్టార్టప్ రంగంలో ఉన్నవారు 2016 నుంచి స్టార్టప్ ఇండియా కార్యక్రమం ఫలితంగా 10వేలకు పైగా పేటెంట్‌లకు దరఖాస్తు చేయడం, 30వేలకు పైగా ట్రేడ్ మార్క్‌లను రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌డీసీ సీనియర్ రీజినల్ మేనేజర్ డాక్టర్ బి.కె సాహు, ఆ-హబ్ సీఈవో రవి ఈశ్వరప్పు, నోవెల్ పేటెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎం.డి హిమబిందు, సైఫ్ ఆటోమేషన్స్ సర్వీసెస్ సీటీఓ ఆలీయాస్గర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు, స్టార్టప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) విశాఖ ఆధ్వర్యంలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. అనువిహార్‌లోని జీసీఎస్ పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న పోటీల్లో ఎనిమిది జట్లు పోటీపడుతున్నాయి. ఫిబ్రవరి రెండో తేదీతో ముగియనున్న ఈ పోటీల్లో అటామిక్ అనెర్జీ విభాగాలకు చెందిన అజంతా, ద్వారకా, ఎల్లోరా, గోల్కొండ, పుష్కర్, రామేశ్వరరం, కోణార్క్‌లతో పాటు నాగార్జున జట్లు తలపడనున్నాయి. ద్వారక-గోల్కొండ జట్ల మధ్య పోటీతో టోర్నీ ప్రారంభమైంది. పోటీల ప్రారంభం కార్యక్రమంలో బార్క్ సైంటిస్ట్, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఎస్‌వో ఎంపీ సూర్యనారాయణ, బాల్‌బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు వెంకట్రావు, ప్రభుజీ పాల్గొన్నారు.



తలపడుతున్న జట్లు

నగరంలో భారీ చోరీ!

బీచ్ రోడ్డు: నగరంలో సోమవారం భారీ చోరీ జరిగినట్లు సమాచారం. మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్ కేర్ ఆస్పత్రి వెనక ఓ ఇంట్లో రూ.40 లక్షల నగదు మాయమైనట్టు తెలిసింది. అయితే దీనిపై మూడో పట్టణ పోలీసులను సంప్రదించగా.. ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

వచ్చే నెల 1 నుంచి వైజాగ్ ఫార్మా ఎక్స్‌పో



మాట్లాడుతున్న ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి సుబ్బారావు

పరవాడ: విశాఖ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో ఫార్మా ల్యాబ్ కెమికల్ ఎక్స్‌పో నిర్వహించనున్నామని మ్యూచువల్ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ (ఎంఏఎస్ఆర్ఎం) కార్యదర్శి, సియాంక, ఔషధ పరిశ్రమ ఎండీ జెట్టి సుబ్బారావు చెప్పారు. జేఎన్‌పీసీ మ్యానుఫ్యాక్చరీస్ అసోసియేషన్ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 125 జాతీయ, అంతర్జాతీయ ఔషధ పరిశ్రమలతో పాటు జిల్లాలోని వివిధ ఔషధ పరిశ్రమల యాజమాన్యాలు కూడా పాల్గొంటాయన్నారు. ఔషధ పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తులను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు ఉంచుతారన్నారు. యాజమాన్యాలు తమ ఆర్డర్లను బుక్ చేసుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు. సమావేశంలో ఎంఏఎస్ఆర్ఎం అధ్యక్షుడు, వెర్ధంతి లైఫ్ సైన్సెస్ పరిశ్రమ ఎండీ ఎం.శివరాంప్రసాద్, ఎగ్జిబిషన్ డైరెక్టర్ అజిత్ కుమార్ శుక్లా పాల్గొన్నారు.

ఎల్ఐసీలో ఐపీవోను వ్యతిరేకించండి



మాట్లాడుతున్న ఎల్ఐసీ ఏవోఐ ఆల్‌ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్

సీతంపేట: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఐపీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని, పాలసీలపై జీఎస్టీ రద్దు చెయ్యాలని ఎల్ఐసీ ఏవోఐ ఆల్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్ డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సోమవారం జరిగిన ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం డివిజన్ 5వ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధిక లాభాలు ఆర్జిస్తున్న ఎల్ఐసీని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ఐపీవోకి అనుమతించిందన్నారు. ఎల్ఐసీ ప్రజల ఆస్తని, దీనిని ప్రైవేటుపరం చేసే హక్కు కేంద్రానికి లేదన్నారు. ఎల్ఐసీలో 32 కోట్ల మంది ఖాతాదారులు ఉన్నారని, వీరి ప్రయోజనాలు కాపాడడం కోసం ఎల్ఐసీ ఏవోఐగా పనిచేస్తుందన్నారు. ఐఆర్‌డీఏ ప్రవేశపెట్టిన పాలసీల వల్ల ఖాతాదారులకు, ఏజెన్సీలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఏజెంట్లకు నష్టం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్‌లో పెద్ద ఎత్తున పోరాడటానికి ఏవోఐ సిద్ధంగా ఉందన్నారు. ఈ సభకు 20 బ్రాంచ్‌ల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరయ్యారు. కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఏవోఐ సౌత్ జోన్ ప్రధాన కార్యదర్శి పి.ఎల్.నరసింహారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవికిషోర్, రాజమండ్రి డివిజన్ అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఐసీయూఐ విశాఖ డివిజన్ ప్రధాన కార్యదర్శి జి. వరప్రసాద్, విశాఖ డివిజన్ ఏవోఐ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నాగరాజు, ఎన్.రవీంద్రనాథ్ పాల్గొన్నారు.